అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డుకు

మహర్దశ

- రూ.12 కోట్లతో రోడ్డు విస్తరణ, సుందరీకరణ
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు చొరవతో పనులు
- దశాబ్దాల నాటి ట్రాఫిక్ సమస్యలు తీరాయని స్థానికుల హర్షం

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డుకు మహర్దశ పట్టింది. రహదారి విస్తరణతో దశాబ్దాలుగా పడుతున్న ఇబ్బందులు తొలగాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి నుంచి నగరంలోకి ప్రవేశించే ప్రధాన మార్గాల్లో ఒకటైన అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలతో ఇరుకుగా ఉండటంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తేవి. ఈ మార్గంలో ప్రయాణించడానికి వాహన చోదకులు అవస్థలు పడేవారు. దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్న గత ప్రభుత్వాలు


60 అడుగులుగా వెడల్పు చేసిన అక్కయ్యపాలెం మెయిన్ రోడ్


రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన ఫుట్‌పాత్

ఏనాడు పట్టించుకోలేదు. స్థానికుల ఇబ్బందుల దృష్ట్యా వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు చొరవతో 2004 మాస్టర్ ప్లాన్ ప్రకారం మెయిన్ రోడ్డు విస్తరణ చేపట్టారు.

విశాలంగా.. సుందరంగా..

రహదారి విస్తరణ కోసం ప్రభుత్వం రూ.11 కోట్లు నిధులు మంజూరు చేసింది. మహారాణి పార్లర్ కూడలి విస్తరణ, బ్యూటిఫికేషన్ కోసం మరో రూ.96 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో జాతీయ రహదారి నుంచి మహారాణి పార్లర్ వరకు


వాటర్ ఫౌంటెయిన్‌తో అందంగా.. విశాలంగా తీర్చిదిద్దిన మహారాణి పార్లర్ కూడలి


80 అడుగుల విస్తరణతో విశాలంగా కనిపిస్తున్న అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు

80 ఫీట్ రోడ్డుగా, పార్లర్ నుంచి దొండపర్తి కూడలి వరకు 60 ఫీట్ రోడ్డుగా విస్తరించారు. దీంతో అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు రూపురేఖలు మారిపోయాయి. విశాలమైన రహదారి, మధ్యలో సెంటర్ మీడియన్, దానిపై విద్యుత్ దీపాలు, మహారాణి పార్లర్ కూడలిలో ఆకర్షణీయంగా వాటర్ ఫౌంటెయిన్‌తో అందంగా కనిపిస్తోంది.

దాదాపు విస్తరణ పనులు పూర్తి..

అక్కయ్యపాలెం ప్రధాన రహదారి విస్తరణ దాదాపు పూర్తయ్యింది. మహారాణి పార్లర్ నుంచి హైవే వరకు ఉన్న రహదారిని 80 అడుగులుగా విస్తరించారు. ఈ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి, సీడబ్ల్యూ డ్రెయిన్లు, దానిపై పాదచారులు నడవడానికి వీలుగా ఫుట్‌పాత్‌లు నిర్మించారు.

రోడ్డు మధ్యలో సెంటర్ మీడియన్ నిర్మించారు. దానిపై విద్యుద్దీప స్తంభాలు ఏర్పాటు చేశారు. మహారాణి పార్లర్ జంక్షన్ నుంచి దొండపర్తి కూడలి వరకు 60 ఫీట్ రోడ్డుగా విస్తరించి ఫుట్‌పాత్‌లు నిర్మించారు. రహదారి విస్తరణతో చాలా వరకు ట్రాఫిక్ సమస్యలు తీరాయని స్థానికులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ ఇక్కట్లు తీరాయి



హైవే నుంచి దొండపర్తి వెళ్లడానికి ట్రాఫిక్ సమస్యలతో చాలా ఇబ్బంది పడేవారం. వివిధ వ్యాపారాలు నిర్వహించే ప్రాంతం కావడంతో ఈ మార్గం నిత్యం రద్దీగా, ఇరుగ్గా ఉండేది. ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునే వీలులేక, తరచూ ట్రాఫిక్ జామ్ అయ్యేది. సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య మరింత అధికంగా ఉండేది. రహదారి విస్తరణతో ట్రాఫిక్ సమస్యలన్నీ తీరాయి.

– వెంకటరమణ, అక్కయ్యపాలెం

ఫుట్‌పాత్‌లు నిర్మించారు



అక్కయ్యపాలెం రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఏ వాహనం ఎటు నుంచి వచ్చి ఢీకొడుతుందే మోనని పిల్లలు, మహిళలు, వృద్ధులు నడవడానికి భయపడేవారు. విస్తరణ పనుల్లో రోడ్డుకు ఇరువైపులా పాదచారులు నడవడానికి ఫుట్‌పాత్‌లు నిర్మించారు. ఇపుడు చాలా సౌకర్యంగా ఉంది.

– గౌరీశంకర్, లలితానగర్

ఘనంగా పరదేశమ్మ తొలేళ్ల ఉత్సవం


తొలేళ్ల ఉత్సవంలో పాల్గొన్న కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ సరిహద్దు ప్రాంతంలోని పరదేశమ్మ ఆలయంలో వార్షికోత్సవ పండగ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం తొలేళ్ల సంబరం వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, పార్టీ నాయకులు ఆళ్ల శివగణేష్, ఆళ్ల శ్రీనివాసరావు, యడ్ల శ్రీనివాసరెడ్డి, ఎస్.తిరుపతిరావు, దాడి శ్రీనివాసరావు, ఆకిరెడ్డి జగదీష్, 42వ వార్డు నాయకులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో హెచ్‌టీ లైన్స్‌పై నిర్వహిస్తున్న నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు శాంతినగర్, సంతోష్‌నగర్, సంజీవయ్య కాలనీ, కైలాసపురం మెయిన్ రోడ్, కస్తూరినగర్, మధుసూదన్ నగర్, దుర్గా కై లాష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

క్లుప్తంగా

నేడు కనకదుర్గమ్మ నవదినోత్సవాలు


నక్కవానిపాలెంలో కనకదుర్గమ్మ ఆలయం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో వెలసిన గ్రామదేవత బెజవాడ కనకదుర్గమ్మవారి నవదినోత్సవాలు, అనుపు ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు దొడ్డి గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 12న చాటింపు, 13న పుట్టమన్ను, 19న పీర్లు, 20న తొలేళ్లు నిర్వహించామని, 28న మారువారం జరుగుతుందని చెప్పారు. మంగళవారం భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేస్తారన్నారు. పలు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సీతమ్మధారలో పోలీస్ పికెట్


పర్యవేక్షిస్తున్న పోలీసులు

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో ఎటువంటి అల్లర్లు జరగకుండా నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఫోర్త్‌టౌన్ హెచ్‌సీ సత్యనారాయణతోపాటు రిజర్వ్‌డ్ పోలీసులు ఎటువంటి గొడవలు జరగకుండా పర్యవేక్షిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే వారి వివరాలు సేకరిస్తున్నారు. వాహనాల రాకపోకలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.

డ్రెయిన్‌లో వ్యర్థాల తొలగింపు


మహారాణి పార్లర్ కూడలి డ్రెయిన్‌లో వ్యర్థాలు తొలగింపజేస్తున్న కామినాయుడు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో మహారాణి పార్లర్ కూడలి వద్ద రోడ్డు విస్తరణలో భాగంగా సీడబ్ల్యూ డ్రెయిన్లు నిర్మించారు. వాటికి శ్లాబ్ వేసేటపుడు ఉపయోగించిన డకింగ్ కర్రలు తొలగించకపోవడంతో ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలు అడ్డుపడి మురుగు నీటి ప్రవాహం నిలిచిపోయింది. దీంతో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు గుమ్మడి కామినాయుడు స్పందించి ఒక వ్యక్తి చేత డ్రెయిన్‌లో అడ్డుపడిన కర్రలు, ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలను తొలగింపజేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పేద ముస్లిం పిల్లలకు ఉచిత ఖత్నా శిబిరం

తాటిచెట్లపాలెం: పేద ముస్లిం పిల్లలకు సీరత్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రైల్వే న్యూకాలనీలోని హోటల్ సింకా గ్రాండ్‌లో ఉచిత ఖత్నా(సున్తీ) వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మట్లాడుతూ సీరత్ కమిటీ ఉచితంగా సున్తీ వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. సీరత్ కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ లతీఫ్, గౌరవ అధ్యక్షుడు హైదర్ ఆలీ సింకాలు మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల్లో గల పేద ముస్లిం పిల్లలకు ఉచితంగా సున్తీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నుంచి అనుభవజ్ఞులైన వైద్యులు డాక్టర్ మౌలాలి, బృందాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐహెచ్. ఫరూఖీ, కమిటీ సభ్యులు మెహబూబ్ షరీఫ్, ముస్తాక్ అహ్మద్, వ్యవస్థాపకులు షబ్బీర్, మహ్మద్ రఫీ, మునీర్‌ఖాన్, అబ్దుల్ ఆసిఫ్, అహ్మద్ అలీ, షేక్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


వృద్ధురాలితో మాట్లాడుతున్న కె.కె.రాజు


ఇందిరానగర్–1లో శిథిలమైన మెట్ల మార్గాన్ని పరిశీలిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు ఇందిరానగర్–1, జైభారత్‌నగర్, శ్రీనివాస్‌నగర్, బాపూజీనగర్, బర్మాక్యాంప్ కొండవాలు ప్రాంతాల్లో సోమవారం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పర్యటించారు. స్థానిక సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. సమస్యల పరిష్కారం, వార్డు అభివృద్ధికి మరింత కృషి చేస్తానని స్థానికులకు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నీలి రవి, కర్రి రామారెడ్డి, అప్పారావు, పద్మ, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తొలేళ్ల సంబరం


అమ్మవార్ల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో కుంచుమాంబ

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్‌లోని రెడ్డి కంచరపాలెం ప్రజల ఆరాధ్య దైవాలు కుంచుమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల తొలేళ్ల సంబరం శ్రీరామ సేవా సమాజం ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా జరిగింది. అల్లిపురం, కాన్వెంట్ జంక్షన్, జ్ఞానాపురం, రామ్మూర్తిపంతులు పేట, రెడ్డి కంచరపాలెం, ఊర్వశి కూడలి వరకు అమ్మవారి ప్రతిమలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రతిమను పుట్టబంగారం వద్దకు చేర్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. మంగళవారం అమ్మవార్ల ప్రధాన జాతర నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఐదో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిబంధనలకు వ్యతిరేకంగా పుస్తకాల విక్రయాలు

చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్

సీతమ్మధార: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల వ్యాపారం చేస్తున్న చైతన్య, నారాయణ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) విశాఖ జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి జి.అజయ్ డిమాండ్ చేశారు. రామాటాకీస్ దరి శ్రీచైతన్య, నారాయణ కళాశాలల వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శ్రీచైతన్య కళాశాల యాజమాన్యం అధిక ధరలకు విద్యార్థులకు విక్రయిస్తున్న పుస్తకాలు, యూనిఫారాలను పట్టుకుని ధర్నా చేసినట్లు చెప్పారు. జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు, ప్రభుత్వ



ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు

అధికారులు ప్రతి విద్యా సంస్థలో తనిఖీలు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ప్రతి కళాశాల వద్ద ధర్నా, ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ఉపాధ్యక్షుడు పి.సాయితేజ, అఖిల్, హర్షిత, సూర్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కార్యక్రమాలు

దాబాగార్డెన్స్ : మానవ హక్కులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్టు డీఎస్‌ఎన్‌ఎల్‌యూ వీసీ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ తెలిపారు. మానవ హక్కుల కౌన్సిల్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడేందుకు కాలుష్య నియంత్రణ మండలి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా పలు ఫార్మా, పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య నియంత్రణపై జిల్లా అధికార యంత్రాంగంతోపాటు జీవీఎంసీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ పోర్టు, స్టీల్‌ప్లాంట్, ఇతర ఫార్మా కంపెనీల కారణంగా విశాఖ నగరంలో కాలుష్యం పెరిగిపోయిందన్నారు. ప్రతీ ప్రాంతంలోనూ గెడ్డలు, కాలువలను కాపాడుకోవాలన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను పక్కాగా అమలు చేసే క్రమంలోనే మానవ హక్కుల కౌన్సిల్ కూడా భాగస్వామ్యమై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మానవ హక్కుల కౌన్సిల్ నేతృత్వంలో చేపట్టబోయే అవగాహన కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏయూ గాంధీయన్ విద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సీతామాణిక్యం, మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు ఎస్వీ రమణ, పైడిరాజురెడ్డి, ఎస్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమించిన వ్యాపారులకు జరిమానా


బిర్యానీ స్టవ్ యజమానికి జరిమానా విధిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిశోర్

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఇష్టారాజ్యంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి సోమవారం వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిశోర్ జరిమానా విధించారు. 'ఇష్టారాజ్యంగా ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు' అనే శీర్షికన ఈ నెల 19న 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు 24వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిశోర్ స్పందించి, ఆయా షాపుల యజమానులకు జరిమానాలు విధించారు. మళ్లీ ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనాథాశ్రమానికి వితరణ


అనాథాశ్రమానికి నిత్యావసర సరకులు అందిస్తున్న బాలుభార్గవ్

కంచరపాలెం: సినీ నటుడు మంచు మనోజ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సోమవారం వైజాగ్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ బాలుభార్గవ్ ఆధ్వర్యంలో 104 ఏరియాలోని కేర్ అండ్ లవ్ అనాథాశ్రమంలో అనాథలకు నిత్యావసర సరకులు అందజేశారు. ముందుగా పిల్లల సమక్షంలో కేక్ కట్‌చేశారు. అనాథలకు భోజనాలు ఏర్పాటు చేశారు. విశాఖలో మనోజ్ అభిమానులు వందల సంఖ్యలో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు బాలుభార్గవ్ తెలిపారు. కార్యక్రమంలో శివ హేమంత్, పవన్, జెమిని గణేష్, చైతన్య, శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఏపీ జెన్‌కో ఎండీ


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న చక్రధరబాబు దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం ఏపీ జెన్‌కో ఎండీ చక్రధరబాబు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్ కుమార్ అందజేశారు.

'గైస్' అభివృద్ధికి సహకారం


కంచరపాలెం కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించిన పూర్వ విద్యార్థులు

మురళీనగర్: కంచరపాలెంలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్(గైస్) అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని కెమ్‌దోసా పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ మేరకు 1979–1983 బ్యాచ్‌కు చెందిన ఎస్.ఆర్.శర్మ, గోపీకృష్ణ, ఎన్.సత్యనారాయణ, బీఎస్ రామమోహన్, జాన్ రత్నంతో కూడిన పూర్వ విద్యార్థుల బృందం సోమవారం కళాశాలను సందర్శించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఇతర అధ్యాపకులతో సమావేశమయ్యారు. కాలేజీలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు, అవసరమైన ఇతర సదుపాయాల వివరాలను వీరు తెలుసుకున్నారు. గైస్‌లో సౌకర్యాల కల్పనకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

అన్నమయ్య సంకీర్తనల శిక్షణ ప్రారంభం


సంకీర్తనలు ఆలపిస్తున్న జ్యోతిర్మయి

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లోని భక్త తుకారాం ఆలయ ప్రాంగణంలో సోమవారం అన్నమయ్య సంకీర్తన శిక్షణ శిబిరం ప్రారంభమైంది. శ్రీవెంకటేశ్వర స్వామి సంకీర్తనల రాయబారి కొండవీటి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ నెల 24 వరకు శిబిరం కొనసాగుతుంది. ఈ శిక్షణలో పాల్గొన్న సుమారు 100 మందికి అన్నమయ్య సంకీర్తనల గురించి జ్యోతిర్మయి వివరించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో భక్త తుకారాం విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి జయరాం, జాయింట్ సెక్రటరీ సోమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దుదాం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ


సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించి నగరంలో కాలుష్యాన్ని అరికట్టేందుకు, విశాఖను కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. తన బంగ్లా నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సోమవారం ఆయన సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను ఉపయోగించాలనే నిర్ణయం మేరకు అధికారులు, సిబ్బంది ప్రజా రవాణాను ఉపయోగిస్తున్నారన్నారు. ఎకో – వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో – జీరో పొల్యూషన్‌లో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టి అమలు చేస్తోందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించాలని కోరారు. అందరూ వారంలో ఒక్కరోజు ప్రజా రవాణాను ఉపయోగించడం ద్వారా విశాఖ నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించేందుకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన నేడు

దాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. లేదా ఇ–మెయిల్ ఐడీ endow-eokanaka@gov.in ద్వారా తెలుసుకోవచ్చు.